సాక్షి
నిర్మల్
ఆదివారం । 30 । జూన్ । 2024



ప్రైవేట్ ఆస్పత్రిలో బాలిక మృతి

భైంసాటౌన్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్న బాలిక మృతి చెందింది. ఆస్పత్రి ఎదుట బాలిక బంధువులు ఆందోళన చేశారు. 8లో▸



పుట్టగొడుగుల్లా వెంచర్లు

పచ్చని పంటపొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా సారంగాపూర్ మండలంలో పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

గురుబ్రహ్మలారా..

We miss you

సండే స్పెషల్

ఈ చిత్రంలో పూలు చల్లుతూ.. బ్యాండు మేళాలతో తమ ఉపాధ్యాయురాలికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్నది సోన్ మండలం కద్తాల్ జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా వెన్నెల ఆరేళ్లుగా ఈ పాఠశాలలో సేవలందించారు. వివిధ క్రీడల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వరుసగా రెండుసార్లు జాతీయస్థాయికి వెళ్లారు. రాష్ట్రస్థాయిలో పలుమార్లు సత్తా చాటారు.



ఆటలతోపాటు వినూత్న కార్యక్రమాలనూ చేపట్టారు. అలా విద్యార్థులకు దగ్గరైన వెన్నెల మేడమ్ ఇటీవల పదోన్నతుల్లో నిర్మల్‌రూరల్ మండలం రత్నాపూర్‌కాండ్లకి బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో తమ మేడమ్ విద్యార్థులు ఇలా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఓదార్చారు.

తన గుర్తుగా ఉండాలని..

ఈ ఫొటోలో సన్మానం అందుకుంటున్న పెద్దసార్ పేరు దుబ్బ లక్ష్మణ్. పదిరూపాయలు ఖర్చుచేసి, వంద రూపాయలు బిల్లులు పెట్టే ఈరోజుల్లో ఈ ప్రధానోపాధ్యాయుడు తన సొంతడబ్బులతో తాను పనిచేస్తున్న బడికి సేవలందించారు. కుంటాల మండలం ఓలా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీజీహెచ్ఎంగా పనిచేసిన లక్ష్మణ్ ఈనెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈసందర్భంగా ఆయనను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇలాంటి సార్‌ను ఎప్పటికీ మర్చిపోలేమని వారు పేర్కొన్నారు. బడికి రూ.30 వేల సొంత డబ్బులతో ఇనుప కిటికీలు



చేయించారు. పిల్లల కోసం క్రీడాసామగ్రిని కొనుగోలు చేశారు. చిన్నపాటి పనులకు ఖర్చులు తానే భరించేవారు. ఇవన్నీ తన జ్ఞాపకాలుగా బడికి సేవలందిస్తే అదే సంతృప్తి అని లక్ష్మణ్‌సార్ పేర్కొన్నారు.

మర్చిపోలేము...



నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ ప్రైమరీ స్కూల్‌లో 2013 నుంచి పనిచేశాను. దాదాపు 11 ఏళ్లుగా అక్కడి పిల్లలతో అనుబంధం ఏర్పడింది. ఇటీవల పదోన్నతులతో కూడిన బదిలీల్లో భైంసాకు వచ్చాను. అన్నేళ్లపాటు అక్కడ పనిచేయడం, ఆ బడితో, అక్కడి పిల్లలతో ఉన్న అనుబంధం ఎప్పటికీ మర్చిపోలేను.

– రాంనరేశ్, ఉపాధ్యాయుడు

ఏళ్లుగా ఒకే బడిలో..

విద్యారంగంలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు 2015లో చేపట్టారు. ఆ తర్వాత పదోన్నతులను చేపట్టలేదు. ఇక ప్రైమరీస్కూల్ హెడ్మాస్టర్లు, భాషాపండితులు, పీఈటీలకు ఏకంగా 15 ఏళ్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. వీరందరికీ ఇటీవల రాష్ట్రప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. దీంతో జిల్లాలో 416 మందికి ఉద్యోగ ఉన్నతి లభించింది. ప్రమోషన్లతోపాటు ఈ టీచర్ల బదిలీలనూ ప్రభుత్వం చేపట్టింది. దీంతో దాదాపు ఒకేబడిలో ఆరు నుంచి పదేళ్లపాటు పనిచేసిన ఉపాధ్యాయులు ఇలా వేరే స్కూల్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఏళ్లపాటు ఒకే చోట పనిచేయడంతో అక్కడి పిల్లలతోనూ ఉపాధ్యాయులకు బలమైన గురుశిష్య బంధం ఏర్పడింది. తాము ఆ బడిలోకి అడుగుపెట్టినప్పుడు ఒకటో తరగతి ఉన్న విద్యార్థులు ఇప్పుడు పదోతరగతి వరకు చేరుకున్నారు. అలా.. దాదాపు పాఠశాల విద్య మొత్తం ఆ టీచర్లతోనే పూర్తయినట్లయ్యింది.

- ప్రమోషన్‌లలో.. ఎమోషనల్ సీన్లు
- ఏళ్లుగా పాఠశాలలతో ఉపాధ్యాయుల అనుబంధాలు
- కన్నీళ్లతో వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు
- భారంగా వీడుతున్న గురువులు

నిర్మల్‌రూరల్: 'మేడమ్.. మీరు రేపటి నుంచి మన బడికి రారట కదా..! వేరే బడికి వెళ్లిపోతున్నారట నిజమేనా..! ఎందుకు మేడమ్..? మన బడి మీకు నచ్చడం లేదా.. లేకపోతే మేమేమైనా తప్పు చేశామా..? చెప్పండి మేడమ్. మీరు ఇక్కడే ఉండాలంటే మేమేం చేయాలో చెప్పండి. విద్యార్థులంటే ఇలా ఉండాలంటూ మీరే కదా.. మన బడిని ఇంత బాగా చేశారు. అలాంటిది మీరే మన బడిని, మమ్మల్ని వదిలి ఎందుకు వెళ్లిపోతున్నారు..? మళ్లీ మన బడికి ఎప్పుడొస్తారు?' అంటూ కళ్లల్లో సుడులు తిరుగుతున్న నీళ్లను ఆపుకుంటూ.. ఆ పిల్లలు అడుగుతుంటే.. ఆ మేడమ్ కళ్లల్లోనూ నీళ్లు వచ్చేశాయి. కాసేపు తాను ఉపాధ్యాయురాలినన్న విషయం మర్చిపోయి, ఆ పిల్లలను గుండెలకు హత్తుకున్నారు. 'అవకాశం ఉన్నప్పుడు మళ్లీ మనబడికి తప్పకుండా వస్తా..' అంటూ భారంగా వారికి వీడ్కోలు పలికారు. తమకు ఆరేళ్లపాటు విద్యాబుద్ధులు నేర్పిన ఆ మేడమ్ తమ బడి గేటు దాటేవరకూ ఆ పిల్లలు తడి కళ్లతో అలా చూస్తూనే ఉండిపోయారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ప్రమోషన్లపై వెళ్తున్న ఉపాధ్యాయుల వీడ్కోలు ఫంక్షన్లలో ఇలాంటి ఎమోషనల్ సీన్లే కనిపిస్తున్నాయి. తమ ఉపాధ్యాయులు బడిని వీడిపోతుంటే చాలామంది విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వారి ప్రేమకు చాలామంది గురువులూ చిన్నపిల్లలవుతున్నారు. ఏళ్లుగా పనిచేసిన బడిని వీడాలని లేకున్నా.. పదోన్నతులపై తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తోందంటున్నారు.

వాళ్లు వెళ్లిపోతూ ఉంటే...

ఏళ్లుగా తమతో ఉన్న గురువులు పదోన్నతులపై వేరే స్కూళ్లకు వెళ్లిపోతుండటంతో చాలామంది విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థి దశలో చాలామంది పిల్లలకు తమ టీచర్లే రోల్‌మోడల్‌గా కనిపిస్తుంటారు. అలాంటి ఉపాధ్యాయులు తమతోనే ఉండాలని కోరుకుంటారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టింది. సరిగ్గా విద్యార్థులు స్కూళ్లకు వచ్చే సమయంలోనే తమ పాత ఉపాధ్యాయులు వెళ్లిపోతారనే విషయం తెలియడంతో వాళ్లు భావోద్వేగానికి గురవుతున్నారు. కొత్తగా వచ్చేసార్లు, మేడమ్‌లు ఎలా ఉంటారో వారికి తెలియదు.. తమకు నచ్చిన పాత ఉపాధ్యాయులే ఉండాలని కోరుకోవడం సహజం. ఈనేపథ్యంలోనే వీడ్కోలు ఫంక్షన్‌లలో విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

గురువుల భావోద్వేగం..

చాలా పాఠశాలల్లో విద్యార్థులతోపాటు పలువురు ఉపాధ్యాయులూ భావోద్వేగానికి గురవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఏళ్లుగా వారు చేసిన సేవలకు గుర్తింపునిచ్చేలా.. వీడ్కోలు పార్టీలను ఘనంగానే నిర్వహిస్తున్నారు. తమ ఉపాధ్యాయులు బడి గేటులోకి అడుగుపెట్టగానే.. వారిపై పూలను చల్లుతూ.. బ్యాండ్‌మేళాలతో తీసుకెళ్తూ.. వీడ్కోలు పలుకుతున్నారు. కొన్నేళ్లుగా తాము నిత్యం కలియదిరిగిన ఆ బడి మైదానంలోనే స్టేజీపైకి ఆహ్వానిస్తున్నారు. తాము విద్యాబుద్ధులు నేర్పిన పిల్లలు, తమతో పాటు సుదీర్ఘంగా సాగిన తోటి ఉపాధ్యాయులు తమ గురించే మాట్లాడుతుంటే ఆ టీచర్లూ కంటతడి పెడుతున్నారు. చివరకు చిన్నారులు కన్నీళ్లతో వీడ్కోలు పలుకుతుంటే చాలామంది గురువులు అంతే భారంగా తాము ఏళ్లుగా పనిచేసిన బడులను వీడుతున్నారు.

న్యూస్‌రీల్

నిర్మల్ మున్సిపల్ సమావేశం

- హాజరైన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న చైర్మన్, అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్మల్ మున్సిపల్ సమావేశం చైర్మన్ ఈశ్వర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ హాజరయ్యారు. పట్టణ అభివృద్ధి, ఇటీవల పట్టణంలో వీధి కుక్కలు ప్రజలపై చేస్తున్న దాడి, వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, శానిటేషన్ పనులు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో డీఈ జాదవ్ సంతోష్, ఏఈ హరిభువణ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలి

సారంగపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల సంఖ్య పెంచాలని డీఐఈవో జె.పరశురాం సూచించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు నమోదైన ప్రవేశాల సంఖ్యను, అందుకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే ఈయేడాది ప్రవేశాల సంఖ్య ఎక్కువగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ మారుతికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వందశాతం హాజరు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.


చెరువులు కబ్జా చేస్తే చర్యలు



కబ్జా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫైజాన్ అహ్మద్

కడెం: చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హెచ్చరించారు. మండలంలోని ధర్మాజీపేట్ ఊర చెరువు కబ్జాకు గురైందని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం చెరువును పరిశీలించారు. చెరువు కబ్జా వివరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ సుజాతకు ఫోన్‌చేసి ఊర చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

మామడ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీవారం డ్రైడే నిర్వహించాలని, దోమలు వృద్ధి చెందకుండా చేపట్టాల్సిన చర్యలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, వైద్యాధికారి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ట్రాన్స్‌జెండర్ చేయూత



విరాళం ప్రకటిస్తున్న ట్రాన్స్ జెండర్ సిరి

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన ట్రాన్స్ జెండర్ సిరి ప్రభుత్వ పాఠశాలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు తనవంతుగా రూ.40వేలు విరాళంగా ఇస్తానని శనివారం ప్రకటించారు. పాఠశాల హెచ్ఎం సిద్ధిరాం రూ.25 వేల పాఠశాల సామగ్రి, ఉపాధ్యాయురాలు రేవతి రూ.6వేల విలువగల బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిరి హాజరై మాట్లాడారు. తాను అందకూర్ పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. 76వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, ప్లేట్లను విరాళంగా ఇచ్చానని గుర్తు చేశారు.

చెరగని ముద్ర



రమేశ్‌రాథోడ్ పార్థీవ దేహం వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- ముగిసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ప్రస్థానం
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు
- ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌గా పలు హోదాల్లో రాణింపు
- బంజారా నేత హఠాన్మరణంతో హతాశులైన కార్యకర్తలు, అభిమానులు

సాక్షి, ఆదిలాబాద్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని రాజకీయ ఉద్దండులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్‌గా పలు హోదాల్లో రాణిస్తూ తనదైన శైలిని చాటారని ప్రత్యర్థులు కూడా ప్రశంసించకుండా ఉండలేని పరిస్థితి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి సామాన్య కార్యకర్తగా పార్టీలో అంచెలంచెలుగా పొలిటికల్ ఇమేజ్‌ను సాధించారని ఆయన గురించి ముందు నుంచి తెలిసినవారు చెబుతారు. అలాంటి నేత హఠాన్మరణంతో కార్యకర్తలు, అభిమానులు హతాశులయ్యారు. తమ సమాజానికి వన్నెతెచ్చిన నేత ఇక లేరని బంజారాలు కన్నీరు పెట్టుకుంటున్నారు.

సామాన్య కుటుంబం నుంచి..

నార్నూర్ మండలం తడిహత్నూర్‌కు చెందిన లంబాడా దంపతులు మోహన్ రాథోడ్–కమలాబాయిలకు 1966, అక్టోబర్ 20న రాథోడ్ రమేశ్ జన్మించారు. ప్రాథమిక విద్య తడిహత్నూర్‌లో, ఉట్నూర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, ఆదిలాబాద్‌లో డిగ్రీ కళాశాలలో బీఏ చదివారు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుమన్‌బాయితో వివాహం జరిగింది. వీరికి కూతురు సొనాలీ, ఇద్దరు కుమారులు రితీశ్ రాథోడ్, డాక్టర్ రాహుల్ రాథోడ్ ఉన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రాథోడ్ రమేశ్ టీడీపీ నుంచి 1995లో నార్నూర్ జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 1999లో టీడీపీ నుంచే ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గోవింద్ నాయక్ చేతిలో రమేశ్ ఓటమి చెందారు. అయితే 2006లో ఆసిఫాబాద్ జెడ్పీటీసీగా గెలుపొంది ఎస్టీ రిజర్వ్‌డ్ అయిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ స్థానాన్ని అధిష్టించారు. 2009 వరకు ఆ పదవిలో కొనసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం ఉన్నప్పటికీ అప్పట్లో రాథోడ్ రమేశ్ గెలుపు సంచలనంగా మారింది. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయంలో తనదైన శైలిలో చక్రం తిప్పారు. దీంతోనే రాజకీయాల్లో ఆయనకు డేరింగ్ అండ్ డ్యాషింగ్ నేత అని పలువురు సంబోధిస్తారు.



రాథోడ్ రమేశ్(ఫైల్)

సామాన్య ప్రజల కోసం రాథోడ్ రమేశ్ కృషి

ఆదిలాబాద్: సామాన్యుల కోసం రాథోడ్ రమేశ్ ఎంతగానో కృషి చేశారని మాజీ ఎంపీ సోయం బాపూరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రమేశ్ మృతిపై సంతాపం తెలిపారు. ఆయన మరణం ఉమ్మడి జిల్లా రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు.

చివరి వరకు క్రియాశీలకమే..

రమేశ్ రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉన్న సమయంలో ఖానాపూర్ స్థానంలో కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ ఉద్యమం విస్తృతంగా సాగుతున్న సమయంలో టీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్ 2008లో అధినేత కేసీఆర్ పిలుపు మేరకు పదవికి రాజీనామా చేశారు. అప్పుడు రాథోడ్ రమేశ్ జెడ్పీ చైర్మన్‌గా ఉన్నారు. ఆ తర్వాత ఖానాపూర్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో రాథోడ్ రమేశ్ తన సతీమణి సుమన్‌రాథోడ్‌ను బరిలోకి దింపి గెలిపించారు. ఏడాదిపాటు ఎమ్మెల్యేగా కొనసాగిన సుమన్ రాథోడ్ ఆ తర్వాత 2009లోను ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం. ఇదిలా ఉంటే 2014 తర్వాత ముఖ్యమైన పదవులకు దూరమైన రమేశ్ రాజకీయంగా కొంత ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. కొద్ది నెలలు మాత్రమే కొనసాగి అనంతరం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. 2018లో ఖానాపూర్ అసెంబ్లీ, 2019లో పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి 2021లో బీజేపీలో చేరారు. 2023లో ఖానాపూర్ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసిన ఆయన మరోసారి ఓటమి చవిచూశారు. కాగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా టికెట్ ఆశించిన ఆయనకు చుక్కెదురైంది. అయినప్పటికీ పార్టీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపుకోసం కృషి చేశారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లిన ఆయన ప్రమాణం స్వీకారం చేసిన బీజేపీ కేంద్ర మంత్రులను, ఎంపీలను కలిసి గురువారమే జిల్లాకు తిరిగి వచ్చారు. ఢిల్లీలో ఉన్న సమయంలో ఆస్పత్రిలో చెకప్ కూడా చేసుకున్న ఆయన అక్కడి నుంచి తిరిగి వచ్చిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

సామాన్యస్థాయి నుంచి ఎదిగిన నేత రాథోడ్ రమేశ్

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేశ్ హఠాన్మరణంపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సామాన్యస్థాయి నుంచి ఎదిగిన నేత రాథోడ్ అని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి, గిరిజనుల అభ్యున్నతికి అండగా నిలిచారని తెలిపారు. రమేష్‌రాథోడ్ అకాలమరణం అందరిని కలచివేసిందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన డీఎస్

నిర్మల్‌చైన్‌గేట్: నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి ధర్మపురి శ్రీనివాస్ అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ మృతికి సంతాపం తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని డీఎస్ నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా తెలుగు ప్రజలకు డీఎస్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన డి.శ్రీనివాస్ అంచలంచెలుగా జాతీయస్థాయి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.



డీఎస్‌కు నివాళులర్పిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

డీఎస్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన గొప్ప నాయకుడని కూచాడి శ్రీహరిరావు కొనియాడారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాల వారీగా ధరణి దరఖాస్తులు, ఇప్పటి వరకు పూర్తయినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండలాల వారీగా వచ్చిన ధరణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు, తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో పరిష్కరించినవి, తదితర అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీం పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఉద్యోగులకు విరమణ సహజం



మోహన్‌రావును సన్మానించిన ఎస్పీ జానకీషర్మిల



ఫౌంటేన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్: ప్రతీ ఉద్యోగి జీవితంలో విరమణ సహజమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందనున్న మోహన్‌రావును జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సత్కరించారు. మోహన్‌రావు తన 34 ఏళ్ల సర్వీస్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, విధుల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. పోలీస్ కానిస్టేబల్ నుంచి మొదలుకొని, తన సర్వీస్ చివరన లోకేశ్వరం ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించి, అందరి మన్ననలు పొందారన్నారు. విరమణ అనంతరం పోలీస్‌శాఖ నుంచి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఏవో యూనుస్‌అలీ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విరాసత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటేన్‌ను పరిశీలించిన ఎస్పీ

జిల్లా కేంద్రంలోని జయశంకర్ సర్కిల్ వద్ద ఉన్న వాటర్ ఫౌంటేన్‌ను ఎస్పీ జానకీషర్మిల పరిశీలించారు. ఫౌంటేన్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపంచడం లేదని తెలిపారు. దీంతో ఫౌంటేన్ ఎత్తు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, గండ్రత్ రమణ, మేడారం అపర్ణ, తౌహీద్ ఉద్దీన్, ముజాయిద్‌చౌస్, అబ్రార్ ఉన్నారు.

పెన్షన్లు పెంచాలి

పెంబి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పెన్షన్లు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు తోడసం శంభు కోరారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో పెన్షన్లు పెంచుతామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా పాత పెన్షన్లే ఇస్తున్నారని తెలిపారు. హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. మేనిఫెస్టోలో వికలాంగులకు ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం అమలు చేయాలన్నారు. హామీల అమలు కోసం జులై 3న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ధర్నాల్లో దివ్యాంగులు, వృద్ధులు, వింతతువులు పాల్గొన్నాలని కోరారు. సమావేశంలో పెంద్రం హనుమంతు, సీడం భీంరావు, అర్క రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోడసం శంభు

క్లుప్తంగా

భారీగా గుట్కా పట్టివేత



స్వాధీనం చేసుకున్న గుట్కాతో పోలీసులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు దుకాణాలు, పాన్‌షాపుల్లో నిషేధిత గుట్కాను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా విడిపోయి పలు దుకాణాలు, పాన్‌షాపుల్లో తనిఖీలు చేపట్టారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్‌కే ట్రేడర్స్, ఆటోనగర్‌లోని సమీర్ అహ్మద్ దుకాణం, బాసర ఎక్స్‌రోడ్ సమీపంలోని మరో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గుట్కా విలువ రూ.8 లక్షల వరకు ఉంటుందన్నారు. నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్సైలు ఎండీ షరీఫ్, నారాయణసింగ్, సిబ్బంది ఉన్నారు.

చేపల వల చుట్టుకొని జాలరి మృతి



సూర్య(ఫైల్)

సోన్(నిర్మల్): శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్ గ్రామానికి చెందిన రుసుకుంటే సూర్య (23) శనివారం చేపల వేటకు గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. ప్రాజెక్టులో తెప్ప పైన చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాళ్ల నుంచి నడుము వరకు వల చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన గడ్డల రవి(30) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. రవికి 12 సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు చెందిన జ్యోతితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు సంతానం ఉన్నారు. ఈనెల 21న అతని భార్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా సాయినగర్ సమీపంలోని బీడు భూముల్లో శనివారం ఉదయం రవి మృతదేహం కన్పించింది. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

కుళ్లిన మృతదేహం లభ్యం

జన్నారం: జన్నారం మండలం పొనకల్ గ్రామ శివారులోని శ్రీలంక కాలనీ చర్చీ సమీపంలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. పొనకల్ ఈవో రాహుల్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజవర్ధన్ శనివారం మృతదేహాన్ని పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహం జన్నారంలో కార్పెంటర్‌గా పని చేసే జగ్గు (50)దిగా గుర్తించారు. జగ్గుకు ఎవరూ లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. ఈవో రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మన 'సారా' మానలేక!

- యథేచ్ఛగా సారా తయారీ
- మహారాష్ట్ర నుంచి ముడిసరుకు రవాణా
- మొక్కుబడిగా అధికారుల దాడులు



మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న ముడిసరుకును పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లాలోని పలు అటవీ ప్రాంతాల్లో నాటు సారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించేందుకు సారా తయారీ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని చెట్ల మధ్య సారాబట్టీలు ఏర్పాటు చేసుకొని తయారు చేస్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గంతో పాటు హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలకు సమీపంలో గల గ్రామాలు సారా తయారీకి అడ్డాగా మారాయి. సిర్సా, అన్నారం, నీల్వాయి, కోటపెల్లి, బ్రాహ్మనపల్లి, అర్జునగుట్ట గ్రామాల్లో సారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. వందల లీటర్ల సారాను ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లోని పొలిమేరల్లో కాపలాదారులను పెట్టి అధికారులు వస్తే సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకొని అక్కడి నుంచి తప్పించుకుంటున్నారు. కాగా ఆయా గ్రామాల్లో పశువుల కాపర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. బట్టీలు ఉండే ప్రదేశాలకు వెళ్లే కాపరులను సారా తయారు చేసే వారు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది.

అక్కడే మకాం..

నాటు సారా తయారీకి వ్యాపారులు రోజుల తరబడి అడవుల్లోనే మకాం వేస్తున్నారు. సారా తయారీకి అవసరమైన ముడి సరుకులు యూరియా, పటిక బెల్లం వంటివి మహారాష్ట్ర నుంచి చేరవేస్తున్నారు. తయారు చేసే వారికి కావాల్సిన ఆహార పదార్థాలను కుండలు, క్యాన్లలో తరలిస్తున్నారు. నీటి వసతి ఉన్న చోట సారా బట్టీలు ఏర్పాటు చేసుకొని తయారైన సారాను క్యాన్లలో పల్లెలు, పట్టణాలకు అక్రమంగా తరలిస్తున్నారు. సారా తయారీ సామగ్రిని తయారీదారులకు చేరవేసేందుకు రోజువారీ కూలీలను వ్యాపారులు వినియోగించుకుంటున్నారు. కూలీలకు భోజనంతో పాటు రూ.300 నుంచి రూ.500 వరకు కూలి చెల్లిస్తున్నారు.

తూతూ మంత్రంగా..

అబ్కారీ శాఖలోని కొంతమంది అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. సారా తయారీదారుల నుంచి మామూళ్లు తీసుకొని ఉన్నతాధికారుల కదలికలను సారా తయారీదారులకు చేరవేస్తున్నట్లుగా కొందరు సారా వ్యాపారులే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి, బెల్లం పానకం, సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఫలించని ప్రభుత్వ వ్యూహం..

నాటు సారా నియంత్రణకు గత ప్రభుత్వం సారా విక్రయదారులను గుర్తించింది. వారికి ఉపాధి కల్పనలో భాగంగా రూ.2లక్షల విలువైన వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు ఆర్థిక సాయం అందజేసింది. జిల్లాలో 247 మందిని గుర్తించి అర్హులైన 211 మందికి పూర్తిస్థాయి ప్యాకేజీ అందించారు. అయినా కొందరు సారాదందా మళ్లీ కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల పోలీసుల దాడులు..

- గత నెల 17న నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుయ్యారం గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రంపై దాడి చేసి భూమిలో పాతిపెట్టిన ప్లాస్టిక్ డ్రమ్మును తవ్వి తీశారు. ఇలా నాలుగు చోట్ల డ్రమ్ములు వెలికి తీశారు. దాడిలో 4,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.
- జిల్లాలోని మందమర్రి మండలం ఆవడం గ్రామ శివారులో ఈనెల 1న రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

సారా తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎవరైనా సారా విక్రయాలు జరిపితే సమాచారం ఇవ్వాలి. ఇప్పటికే అటవీ ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశాం. సారా తయారీకి వినియోగించే ముడిసరుకు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. సారా తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కే.జీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

కవ్వాల్ అందాలు భేష్

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- సఫారీలో ప్రయాణం



బైసన్‌కుంట వద్ద పీవో, కుటుంబ సభ్యులు

జన్నారం: కవ్వాల్ అడవుల్లో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పర్యటించారు. ఉదయం గేట్ నంబరు–1 నుంచి గోండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ వరకు సఫారీలో ప్రయాణించారు. బైసన్‌కుంటలో కాసేపు పక్షులు, జంతువులను చూశారు. అడవిలో కొంతసేపు గడిపారు. సఫారీలో వెళ్తున్న క్రమంలో చుక్కల దుప్పులు, అడవి దున్నలు, అడవి పందులు, కొండగొర్రెలు, వన్యప్రాణులు, సర్పెంట్ ఈగల్, హక్ ఈగల్, కింగ్‌ఫిషర్, అలెక్సా డ్రీన్ వంటి పక్షులు చూసి మురిసిపోయారు. పచ్చదనం పరుచుకున్న అడవుల్లో పర్యటించడం గొప్ప అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు. వీరికి జన్నారం ఇంచార్జీ రేంజ్ అధికారి సుష్మారావు, సిబ్బంది ఇక్కడి వివరాలు తెలియజేశారు.

'ప్రాణాలు పోయినా భూమిని వదలం'



మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకల్యాణి

కడెం(ఖానాపూర్): ప్రాణాలు పోయినా భూములు వదిలే ప్రసక్తి లేదని, తమ భూములు తమకే దక్కాలని మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడ వాసులు అన్నారు. వారు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్న తమ భూములను పునరావాసం పేరుతో రాంపూర్, మైసంపేట్ వాసులకు కేటాయించి తమకు అన్యాయం చేయవద్దన్నారు. రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు రీ లొకేషన్ ప్యాకేజీలో భాగంగా మండలంలోని పెత్తర్పు సమీపంలో కేటాయించిన భూముల్లో గొండుగూడవాసులు వారం రోజుల నుంచి సాగు పనులు చేపడుతున్నారు. దీంతో శనివారం ఆర్డీవో రత్నకల్యాణి వ్యవసాయ భూములను పరిశీలించి, గొండుగూడ వాసులతో మాట్లాడారు. ఇతరులకు కేటాయించిన భూముల్లో సాగు పనులు చేపట్టవద్దని, గొండుగూడవాసుల డిమాండ్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. తహసీల్దార్ సుజాత, ఎఫ్‌ఆర్వో అనిత, సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, రాజ్‌గొండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, సలహాదారు అంకుశ్‌రావు పటేల్, సుంగు, సుర్యాభాను, దత్తురాం, లింగు, భీంరావు, మారుతి తదితరులు ఉన్నారు.

అంకోలి పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) బృందం సభ్యులు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని వివిధ సబ్ సెంటర్, పీహెచ్‌సీలలో ఉన్న మాత్రల నిల్వలు, పేషెంట్స్, గర్భిణీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే నాన్‌కమ్యూనికేబుల్ డిసీజెస్‌పై అక్కడి ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. తనిఖీల్లో సీపీహెచ్‌వో కార్డియో వసిలర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వసి, జిల్లా డీఎంవో, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శ్రీధర్, పీహెచ్‌సీ నోడల్ అధికారి యశోద, బొమ్మెత సుభాష్, సూపర్‌వైజర్లు లక్ష్మీ, శ్యామల, వసంత, హెల్త్ అసిస్టెంట్స్ ప్రేమ్ సింగ్, స్టాఫ్ నర్సులు గంగామణి, ప్రతిమ, గణంకాల అధికారి నాగరాణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో బాలిక మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



పల్లవి (ఫైల్)



ఆందోళన చేస్తున్న బాలిక బంధువులు

భైంసాటౌన్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్న బాలిక మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన కథనం ప్రకారం.. కుభీర్ మండల కేంద్రానికి చెందిన శంకర్, విజయల కూతురు పల్లవి(14) కడుపునొప్పితో బాధపడుతూ శుక్రవారం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యుడు అపెండిక్స్ ఆపరేషన్ చేయాలని సూచించారు. సాయంత్రం మూడు గంటల పాటు ఆపరేషన్ చేసి పరిస్థితి బాగానే ఉందని, వారం రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాలని వైద్యుడు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం పరిస్థితి విషమించి బాలిక మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు శనివారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని, ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. అనంతరం బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు వైద్యుడు రజనీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విషయంపై వైద్యుడిని వివరణ కోరగా చిన్నపేగులో రంధ్రాల కారణంగా పొట్టలో చీము ఏర్పడిందని, దీంతో బీపీ తగ్గి సెప్టిక్ షాక్‌తో బాలిక మృతి చెందిందని, తన నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

- మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: కమీషన్లు, పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ పట్టణాభివృద్ధిపై ఎందుకు లేదని పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ చైర్మన్, కమీషనర్ల వాహనాలకు నెలకు రూ.33వేలు అద్దె చెల్లిస్తుండగా బల్దియా డ్రైవర్లను ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా దొడ్డిదారిన అద్దెకిచ్చినట్లుగా మడిగెలకు డీడీలను తీసుకొని అద్దెలు వసూలు చేసిన జూనియర్ అసిస్టెంట్, ఆర్‌వోలను విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రూ.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ పది రోజులు కూడా పని చేయకుండానే మూలన పడేశారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అజయ్ అన్నారు. తమ కాలనీల్లో గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, కాంగ్రెస్ కౌన్సిలర్ విజయ్ తెలిపారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బండారి సతీశ్ మాట్లాడుతూ రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ నిర్వహించేదెప్పుడని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డులో పశువుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన గోశాలను ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. కమిషనర్ ఖమర్ అహ్మద్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఎజెండాలో పొందుపర్చిన మున్సిపల్ మడిగెల అద్దె కేటాయింపులకు సంబంధించిన అంశం మినహా మిగతా ఎజెండాను కౌన్సిల్ ఆమోదించింది. దొడ్డిదారిన కేటాయించిన మడిగెలను రద్దు చేయాలని కోరుతూ 30 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన దరఖాస్తును చైర్మన్‌కు అందజేశారు. సమావేశంలో బల్దియా అధికారులు పాల్గొన్నారు.

రాథోడ్ రమేశ్ మృతితో విషాదఛాయలు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: నియోజకవర్గ ఎమ్మెల్యేగా, ఎంపీగా అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందిన మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ నాయకులు రాథోడ్ రమేశ్ మృతితో నియోజకవర్గంలో, ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకొని ఆయన పార్థీవదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణలు రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతితో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాల బంద్ పాటించారు.

హర్యానా గవర్నర్ సంతాపం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త ఎంతగానో బాధించిందన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన రమేశ్ రాథోడ్ జిల్లా కోసమే కాకుండా బంజారాల అభివృద్ధ/ కోసం విశేషంగా కృషి చేశారన్నారు.

బతుకుదెరువుకు వెళ్లి.. అనంత లోకాలకు



వెంకటేష్ (ఫైల్)

దస్తురాబాద్: బతుకుదెరువు కోసం దేశం కాని దేశం వెళ్లిన వ్యక్తి అనారోగ్యంతో అక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బరిగెల వెంకటేష్(34) బతుకుదెరువు కోసం ఎనిమిదేళ్ల క్రితం ఘనా దేశానికి వెళ్లాడు. గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అడవి పందులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు



నిందితులతో అటవీశాఖ అధికారులు

భైంసాటౌన్: అడవి పందులను వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు భైంసా ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ రాథోడ్ తెలిపారు. శుక్రవారం రాత్రి 2 గంటల ప్రాంతంలో బాసర అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద బీట్ ఆఫీసర్ లెనిన్ వాహన తనిఖీలు చేపట్టగా, వరంగల్‌కు చెందిన రాజశేఖర్, మహేశ్ మహారాష్ట్రలోని బిలోలి నుంచి 14 అడవి పందులను వాహనంలో జనగాం తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని భైంసాలోని రేంజ్ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న పందులను అడవిలో వదిలేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి శనివారం భైంసా కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. డీఆర్‌వో ఇర్ఫానుద్దీన్, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు హరిలత, స్రవంతి ఉన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీలకు ఎంపిక



దువాస హర్షిని



కొండ్రా అలేఖ్య

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయి నృత్య పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన డాన్స్ కా భూకంప్ రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో దువాస హర్షిని, కొండ్రా అలేఖ్యలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి తెలిపారు. వీరు త్వరలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



నితీశ్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో నితీశ్(30) అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్‌కు చెందిన నితీశ్ భార్య, ఏడాది కూతురుతో కలిసి కిసాన్‌గల్లిలో నివాసముంటున్నాడు. స్థానికంగా సెలూన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జ్వరంతో ఉన్న కూతురును భార్య ఆస్పత్రికి తీసుకెళ్లగా తలనొప్పిగా ఉందని నితీశ్ ఇంట్లోనే ఉండిపోయాడు. వారు ఆస్పత్రి నుంచి వచ్చి చూసే సరికి నితీశ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సారంగపూర్(నిర్మల్): మండలంలోని మలక్‌చించోలి గ్రామ వైకుంఠధామం వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సల్ల శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై, సిబ్బందితో కలిసి మఫ్టీలో వైకుంఠధామం వద్దకు వెళ్లారు. ఈక్రమంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ.8660 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు గాయాలు

బజార్‌హత్నూర్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు స్వల్ప గాయాలైన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకొండ నుంచి మోడల్ పాఠశాలకు 15 మందికి పైగా విద్యార్థులు ఆటోలో వెళ్తున్నారు. దేగామ సమీపంలోని మూల మలుపు వద్ద కుక్కలు అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ వాటిని తప్పించే క్రమంలో రోడ్డు దించడంతో ఆటో చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

మేకపై కుక్క దాడి

బోథ్: మండల కేంద్రంలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం ఓ మేకపై కుక్క దాడి చేసింది. దీంతో మేకకు తీవ్ర గాయాలయ్యాయి. కొన్ని రోజులుగా కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు యూనూస్‌ను టు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం జిల్లా జైలు సమీపంలో మట్కా నిర్వహిస్తుండగా పోలీసులకు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అతడి నుంచి మట్కా చిట్టీలతో పాటు రూ.1120 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మదన్ తెలిపారు.

పాత నేరస్తుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: హత్యాయత్నం కేసులో నేరస్తుడిగా ఉంటూ, పరారీలో ఉన్న నిందితుడు ముషారఫ్‌ను వన్ టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడు పట్టణంలోని పాత బస్టాండ్‌లో హత్యాయత్నానికి పాల్పడి గత నాలుగు నెలలుగా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఆయనను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి గ్రామంలో సాయిశ్రీ సరస్వతి (20) అనే వివాహిత ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్ కాలనీకి చెందిన సాయిశ్రీ సరస్వతి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన నరేశ్‌ను ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. భర్త నరేశ్ ఎం పని చేయకుండా ఇంటి వద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన సాయిశ్రీ సరస్వతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేశ్‌తో పాటు ఆయన సోదరుడు, తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చుక్కల దుప్పి హతం.. నలుగురి రిమాండ్



నిందితులతో ఫారెస్టు అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వేంపల్లి ఫారెస్టు బీట్‌లో ఈనెల 13న చుక్కల దుప్పిని హతమార్చిన మరో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రమాదేవి, డెప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌బాబు తెలిపారు. సిర్పూర్ (టి) మండలం వేంపల్లి గ్రామపంచాయతీలోని మన్నెగూడకు చెందిన చిట్టం బిక్షపతి, చిలకయ్య, నాగేశ్, కన్నెపల్లి రమేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదివరకే ఈనెల 17న మన్నెగూడ గ్రామానికి చెందిన నాయని అశోక్, రాలే అంజి, టేకం తిరుపతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్రమంలో వేంపల్లి ఎఫ్‌బీవో విజయచంద్ర ఉన్నారు.